లక్ష్యానికి మించి రుణాలు

- తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరుల్లో 2022–23 ఆర్థికంలో మహిళా సంఘాలకు రూ.397.71 కోట్ల లక్ష్యం
- ఈనెల రెండో వారానికే మంజూరు చేసింది రూ.498.34 కోట్లు
- పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో మార్పు



పీలేరులో మహిళా సంఘాల సభ్యుల సమావేశం



మహిళా సంఘాల సభ్యులకు మెగా రుణ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి (ఫైల్)

బి.కొత్తకోట : మహిళా సంఘాలు బలమైన ఆర్థిక వ్యవస్థగా మారి ప్రస్తుతం మహిళలు రూ.కోట్ల లావాదేవీలు నిర్వహించే స్థాయికి ఎదిగాయి. ప్రభుత్వ ఆర్థిక చేయూత, బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తూ సహకరిస్తుండటంతో సంఘాల్లోని మహిళల కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మార్పు కనిపిస్తోంది. రుణాలు పొందిన రుణాలతో వ్యాపార, కుటిర పరిశ్రమలు, దుకాణాల నిర్వహణ తదితర కార్యకలాపాలతో ఆదాయ వనరులను పెంచుకొన్నారు. మహిళలకు రుణాలిస్తే సమస్యలుండవని, దీనికి హామీ, వడ్డీ చెల్లింపు బాధ్యత ప్రభుత్వానిదే కావడంతో ఇబ్బడి ముబ్బడిగా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నాయి. రుణాలు పొందిన మహిళలు బ్యాంకులకు రుణాలను తిరిగి చెల్లిస్తున్నారు. దీనికి తోడు స్త్రీశక్తి రుణాలు మంజూరు, వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరించడం మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కారణమవుతోంది.

అదనంగా రూ.100 కోట్లు..

తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో 2022–23 ఆర్థిక సంఘానికి రూ.397.71 కోట్ల రుణాలను బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు మంజూరు చేయించాలన్నది లక్ష్యం. 15 మండలాల్లోని 8,471 మహిళా సంఘాలకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ లక్ష్య సాధనకు వచ్చే మార్చి31 వరకు గడువు ఉంది. అయితే అంతకుముందే ఈనెల రెండో వారానికే ఈ రుణ లక్ష్యాలను సాధించారు. నిర్దేశించుకున్న సంఘాలకు ఇప్పటికే రూ.498.34 కోట్ల రుణాలను మహిళలకు మంజూరు చేశారు. అంటే ఆర్థిక లక్ష్యానికి మించి రూ.100.63 కోట్లు అదనంగా రుణాలు ఇచ్చారు. ఈ రుణాలను సంఘాలకు చెందిన మహిళలు పంచుకొని ఆర్థికాభివృద్ధి దిశగా వ్యాపార కార్యకలాపాల విస్తరణకు సద్వినియోగం చేసుకుంటున్నారు. అత్యధికంగా మదనపల్లెలో 1,236 సంఘాలకు, పీలేరులో 1,221 సంఘాలకు రుణాలిచ్చారు.

ఉపాధి కల్పించిన రుణం



టెర్రకోట బొమ్మల దుకాణం నిర్వహిస్తున్న జానకీ

సోమల మండలం కందూరుకు చెందిన జానకి టెర్రకోట హస్తకళలో ప్రావీణ్యం సాధించి మూడన్నర ఏళ్లుగా కురబలకోట మండలం అంగళ్లు టెర్రకోట నగర్‌లో ఉంటోంది. పార్వతి డ్వాక్రా గ్రూపులో బ్యాంకు లింకేజీ కింద రూ.1.50 లక్షలు రుణం తీసుకుని టెర్రకోట స్టాల్ ఏర్పాటు చేసుకున్నారు. సొంతంగా కుండలు, బొమ్మలు తయారు చేస్తూ నెలకు రూ. 30 వేల దాకా ఆదాయం సంపాదిస్తోంది. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తోంది. మహిళా సంఘంలో సభ్యురాలు కావడంతో ఆర్థిక సహకారంతో జీవనం లభించి, జీవితంపై ధైర్యం వచ్చిందని చెబుతోంది జానకీ.

బ్యాంకుల సహకారం

మహిళా సంఘాలకు రుణాలు మంజూరుకు బ్యాంకులు సహకరిస్తున్నాయి. రుణాల వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తున్నందున బ్యాంకులకు ఇబ్బంది ఉండదు. దీనికితోడు రుణాల చెల్లింపు సక్రమంగా సాగుతున్నాయి. మహిళలు పొందిన రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. దీనితో వీరికి స్త్రీశక్తి, వీఓ, ఎంఎస్ నుంచి కూడా రుణాలు అందిస్తున్నాం.

-సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ

భారం తప్పించిన సీఎం

మహిళా సంఘాలకు ప్రభుత్వం అండగా ఉంది. వారి అభ్యున్నతి కోసం ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వైఎస్ఆర్ భరోసా పేరుతో రుణాలను తిరిగి చెల్లిస్తోంది. ప్రస్తుతం తీసుకుంటున్న రుణాలకు మహిళలు వడ్డీ చెల్లించే భారం నుంచి తప్పించి ఆ వడ్డీ సొమ్మును ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తోంది. దీనితో మహిళలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోంది.

- పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో కుటుంబసమస్యలతో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. చౌడేపల్లె మండలం బోయకొండకు చెందిన షానవాజ్ భార్య సానియా (19) కూలి పనులు చేస్తుండేది. ఈ క్రమంలో శనివారం కుటుంబసమస్యలపై భర్తతో గొడవపడింది. అనంతరం మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన గంగాధర్ భార్య ప్రశాంతి (24) కుటుంబసమస్యల కారణంగా భర్తతో గొడవపడింది. మనస్తాపానికి గురై తలకు రంగు పెట్టేందుకు ఉపయోగించే హెన్నాను నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గాలివీడు మండలం గోరాన్‌చెరువుకు చెందిన రామ్మోహన్ భార్య లలితమ్మ(39) కుటుంబసమస్యలతో మనస్తాపం చెంది శుక్రవారం సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా సంఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనాల్లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బంగారు నగల దుకాణంలో చోరికి యత్నం

గుర్రంకొండ: గుర్తు తెలియని దుండగులు బంగారు నగల దుకాణంలో చోరికి యత్నించిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. స్థానిక బస్టాండులో రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తి నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. కొంతమంది దుండగులు శుక్రవారం రాత్రి దుకాణం ఉన్న గదికి వెనుకవైపు ఉన్న గోడను బద్దలు కొట్టే యత్నం చేశారు. గుణపాలతో గోడను కొంత భాగం తవ్వేశారు. చుట్టుపక్కల వారు శబ్దాలకు లేచి వచ్చి కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. చోరీకి యత్నించిన వారి వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి



పాఠశాలలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న జడ్జి గాయత్రి

పీలేరు : స్థానిక మదనపల్లె మార్గంలోని ఎస్టీ గురుకుల పాఠశాలను జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి అకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం పాఠశాలను సందర్శించిన జడ్జి పాఠశాలలో సౌకర్యాలు, ఇబ్బందులు గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువుతోపాటు భోజన సౌకర్యాలు ఎలా ఉన్నాయని, పిల్లలపై ఎవరైనా దురుసుగా ఉన్నారా అని ఆరా తీశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ తోపాటు ఉపాధ్యాయులు, వార్డెన్ బాగా చూసుకోవాలని ఆదేశించారు. విద్యనందించడం తోపాటు క్రీడలు కూడా ఆడించాలని సూచించారు. హాస్టల్, తరగతి గదులు రేకుల షెడ్లలో ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారులకు రిపోర్టు చేయాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను సూచించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, వార్డెన్ గోపి పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి విరాళం

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి గర్భాలయ నిర్మాణానికి దాతలు రాణి రెడ్డి రూ. 50,116 విరాళం అందజేశారు. గతంలో ఉన్న గర్భాలయాన్ని తొలగించి ఇటీవల నూతనంగా ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సతీమణి నీరజ ఆధ్వర్యంలో సుండుపల్లె మండలం ముడుం పాడు గ్రామానికి చెందిన పొత్తపు రామచంద్రారెడ్డి, పార్వతమ్మ దంపతులు ఆలయ నిర్మాణానికి విరాళం ప్రకటించారు. ఈమొత్తాన్ని దాత కుమార్తె రాణిరెడ్డి శనివారం ఆలయానికి చేరుకొని ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ మంజులకు అందజేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాన్ని వారికి అందజేశారు.

పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేయాలి

పెద్దమండ్యం: పక్కాగృహాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని పాపేపల్లె, దాసరిపేట, గుడిశవారిపల్లె, పాపేపల్లె కాలనీలలో పక్కాగృహాల నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలకు చెల్లించిన బిల్లుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది మూవ్‌మెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిబ్బంది కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జనార్దన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువు మీదుగా బెంగళూరుకు బస్సు సర్వీసు

ములకలచెరువు : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి ములకలచెరువు మీదుగా కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు ఆర్టీసీ బస్సును అధికారులు శనివారం ప్రారంభించారు. ప్రయాణికుల వినతి మేరకు కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. రాయచోటిలో ఉదయం 6 గంటలకు బయలుదేరి గాలివీడు, పెద్దమండ్యం, తంబళ్లపల్లి, ములకలచెరువు, చింతామణి, హోస్కోట మీదుగా బెంగళూరుకు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటుంది. తిరిగి 3.30 గంటలు బెంగళూరులో బయల్దేరి రాత్రి 9:35 గంటలకు రాయచోటి చేరుకుంటుందని చెప్పారు. ప్రయాణికులు గమనించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

తూనికలు, కొలతల్లో వ్యత్యాసాలు ఉంటే చర్యలు



తూనికల యంత్రాలను తనిఖీ చేస్తున్న నాగరాజు

పీలేరు రూరల్ : వ్యాపార దుకాణాల్లో తూనికలు, కొలతల్లో వ్యత్యాసాలు ఉంటే చర్యలు తప్పవని తూనికలు, కొలతల ఇన్స్‌పెక్టర్ నాగరాజు అన్నారు. శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వెయింగ్ మిషన్, తూకం రాళ్ల బరువులు సరి చూశారు. అలాగే కొలతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వ్యాపారస్తులు 60 దుకాణాలకు సంబంధించి వెయింగ్‌మిషన్లు పరిశీలించామని తెలిపారు. నాయుడు, బాషా, ఈశ్వర్, మోహన్ పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో మరుపొంగళ్లు

పీలేరు రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని శ్రీ మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయంలో మరుపొంగళ్లు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే హరికథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి భక్తుల కాలక్షేపానికి చెంచునాటకం ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటరమణనాయుడు, మల్లికార్జునరెడ్డి, చంద్రకుమార్‌రెడ్డి, శేఖర్, శంకరస్వామి, మల్లికార్జున, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పూర్తి చేయాలి

కలికిరి : రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంట వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండలంలోని మేడికుర్తి, మర్రికుంటపల్లి రైతు భరోసా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ-పంట నమోదుకు ఈ నెల 28 ఆఖరు గడువని, రైతులకు ప్రభుత్వం నుంచి ఏలాంటి రాయితీలు, నష్టపరిహారం అందాలన్నా పంట నమోదు తప్పనిసరిగా అన్నారు. అంతకు మునుపు ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఓ మమతారెడ్డి, విఏఏ త్రిసూల్, వీహెచ్ఎ రోషన్‌ఆరా పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

కేవీపల్లె : మండలంలోని వగళ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. విద్యార్థిని పి. తేజశ్వినికి తల్లిదండ్రులు లేరు. ఇటీవల ఈ పాఠశాలను సందర్శించిన డీఈఓ వై. రాఘవరెడ్డి దృష్టికి ఆమె పేదరికం గురించి తెలియజేశారు. విద్యార్థినిని ఆదుకోవడానికి తనవంతు కృషి చేస్తానని డీఈఓ హామీ ఇచ్చారు. డీఈఓ ప్రేరణతో మదనపల్లెకు చెందిన శ్రీ సత్యసాయి స్కూల్ కరస్పాండెంట్ విజయేంద్ర రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. విద్యార్థిని ఖాతాకు ఆర్థిక సాయం జమ చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రావణి తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు కంటి పరీక్షలు

మదనపల్లె : పట్టణంలోని ఆర్టీసీ-2 డిపో ఉద్యోగులకు దృష్టి నయనధామ, డాక్టర్ అగర్వాల్ ఐ ఆస్పత్రి సంయుక్త నిర్వహణలో డిపో మేనేజర్ నిరంజన్ ఆధ్వర్యంలో ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ట్రైనింగ్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని దృష్టి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వంశీధర్‌రెడ్డి, డిపోమేనేజర్ నిరంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ సిబ్బందికి కంటిచూపు బాగా ఉంటే వారితో పాటు ప్రయాణికులు సురక్షితంగా గమ్యం చేరుతారన్నారు. కార్యక్రమంలో అగర్వాల్ హాస్పిటల్ మేనేజర్ జగదీష్‌బాబు, వీఎస్ఆర్ గ్రాండ్ సుధాకరరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

తంబళ్లపల్లె : హాస్టల్ విద్యార్థులు బాగా చదివి, మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ హరీష్‌బాబు తెలిపారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించేందుకు ప్రశ్నించి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, మంచి ఫలితాలు సాధించి ఉన్నతస్థాయికి చేరాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూమేరకు వంటల నాణ్యతగా వడ్డించేలా చొరవ చూపాలని వార్డెన్ షాహీనాబేగంను ఆదేశించారు.

కమ్యూనిస్టుల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదు

మదనపల్లె : నిరంతరం దేశక్షేమం కోసం, కార్మికులు, కర్షకులు, కష్టజీవుల అభ్యున్నతికి కృషిచేస్తూ వారి సహకారంతో రాజకీయాలు నడుపుతున్న కమ్యూనిస్టుల గురించి మాట్లాడే అర్హత బీజేపీ నాయకులకు లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం పట్టణ సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వామపక్షాలపై సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు.

పక్కా గృహాలకు రూ.8.26 కోట్లు

బి.కొత్తకోట: మండలంలోని వైఎస్సార్-జగనన్న కాలనీల్లో పేదలు నిర్మించుకుంటున్న పక్కా గృహాలకు రూ.8.26 కోట్ల రుణాలు చెల్లించామని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం మురళి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటి వరకు 2,360 ఇళ్ల నిర్మాణాలకు ఒక్కో లబిదారునికి రూ.35వేల రుణం చెల్లించినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బి.కొత్తకోట: మండలంలోని పెద్దపల్లెలో కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు చేసినట్లు ఎస్ఐ రామమోహన్ శనివారం తెలిపారు. ఈ దాడుల్లో మద్యం విక్రయిస్తున్న వెంకటేష్‌ను అరెస్ట్ చేసి 38 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామని తెలిపారు.

ములకలచెరువు: అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శనివారం తెలిపారు. చౌడసముద్రం పంచాయతీ గుత్తావారిపల్లె తండాకు చెందిన బి.క్రిష్ణప్ప నాయక్(50) మద్యం విక్రయిస్తుండగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. 96 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎంలో వెలిసిన హజరత్ ఖాజా సయ్యద్ ఖాదర్‌షా వల్లి దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం గంధోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంధంను గుర్రంకొండ నుంచి పూల తాజియాలతో ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. ఫకీర్లు విన్యాసాలతో, బాణాసంచా వేడుకలతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. దర్గాను రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. హిందూ, ముస్లిం సోదరులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పెట్రోల్‌బంకు ఏర్పాటుకు సన్నాహాలు

మదనపల్లె సిటీ : ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. సంస్థ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకును నడపనున్నారు. మదనపల్లె ఆర్టీసీ డిపో ఆవరణంలో భారత్ పెట్రోలియం బంకు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వన్ డిపో కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పెట్రోల్ బంకు పనులు పూర్తి చేశారు. ఇటీవల జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి జగదీష్ పెట్రోల్ బంకు పనులను పరిశీలించారు. త్వరలో ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకును నడపనున్నారు. దీంతో ఆర్టీసీకి మరింత ఆదాయం చేకూరనుంది.

6న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ : ప్రముఖ శైవక్షేత్రమైన అరుణాచలంకు పౌర్ణమి పురస్కరించుకుని మార్చి 6న ప్రత్యేక బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో-2 డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండు నుంచి ఉదయం 9.30 గంటలకు అల్ట్రా డీలక్స్ పుష్‌బ్యాక్, టీవీ సౌకర్యంతో రానుపోను చార్జీలతో రూ.790 చెల్లించాలన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన వెంకటరమణ(50) కూలిపనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం పనులకు వెళ్లేందుకు ఇంటివద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఘటనలో వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితున్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎస్సీల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

వాల్మీకిపురం : రాష్ట్రంలోని ఎస్సీల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన మద్దెల రవీంద్ర శనివారం స్థానిక పంచాయతీలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలుసుకొని దుశ్శాలువతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రవీంద్ర మాట్లాడుతూ ఎస్సీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కేశవ రెడ్డి, రఘు, రాయుడు, సుధాకర్, వెంకటస్వామి, రమణ, మహేష్, విజయ్, మురళి, నాగార్జున, రూపేష్, శివ, కమలాకర్ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

కలకడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్‌రాజ, ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్ రెడ్డి ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోని పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. యువతకు ప్రాధాన్యత ఇచ్చి శాసన మండలికి పంపితే అభివృద్ధికి, ఉపాధి అవకాశాలు కల్పించడానికి దోహదపడతారని తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే కేసులు

కలకడ : మండలంలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు సకాలంలో, నిత్యవసర సరుకులు అందజేయకుండా అక్రమాలకు పాల్పడితే కేసులు తప్పవని డిప్యూటీ తహసీల్దార్‌లు వెంకటరెడ్డి, సయ్యద్ హెచ్చరించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ చౌక దుకాణ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లుతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డీలర్లు విధిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, కేటాయించిన గ్రామంలోనే స్టాక్ నిల్వ ఉండాలన్నారు. స్టాక్ బోర్డు, ఫిర్యాదుల పెట్టె, దుకాణం నంబర్ నమోదు చేసి ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్ఐ మస్తాన్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి

వాల్మీకిపురం : మండలంలోని గండబోయనపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చిచ్చిలి రాజా రెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డిలు గండబోయనపల్లిలోని మృతుడి కుటుంబానికి చేరుకొని, మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడు నిరంజన్ రెడ్డిని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట చింతల ఆనంద రెడ్డి, సర్పంచ్ గుర్రప్ప, శీనా, రాజన్న, సత్తిపండు, వీరాంజనేయులు ఉన్నారు.

ఇద్దరు ఉద్యోగులకు మెమో

బి.కొత్తకోట : సచివాలయాలకు సమయానికి హాజరుకాని ఇద్దరు ఉద్యోగులకు మెమో జారీ చేస్తున్నట్టు ఎంపీడీఓ మంగళం శంకరయ్య చెప్పారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రభుత్వ పథకాల అమలు, ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి రోజులో రెండుసార్లు హాజరు నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో చర్యలుంటాయని చెప్పారు. లబ్ధిదారులకు పథకాలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు పాటించేలా ఎక్కడా పార్టీల బ్యానర్లు లేకుండా తొలగించాలని సూచించారు.

చేనేత సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్

మదనపల్లె సిటీ : చేనేత సంక్షేమ సంఘం మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉప్పు వెంకటేష్‌ను నియమించినట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కుర్రా వెంకటరమణ తెలిపారు. వెంకటేష్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

జిల్లా మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడిగా షేక్ రజాక్

కురబలకోట : బీజేపీ జిల్లా మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మండలంలోని నందిరెడ్డిగారిపల్లెకు చెందిన షేక్ రజాక్‌ను నియమించారు. శనివారం నియామక పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని తెలిపారు.

తెట్టులో రక్తదాన శిబిరం

కురబలకోట : మండలంలోని తెట్టులో గ్రామ సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సచివాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది రక్తదానం చేశారు. మదనపల్లె జిల్లా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు ఈ రక్తాన్ని అందజేశారు. కొరివి జగన్నాథరెడ్డి, నారాయణ, నవాజ్‌బాషా, తన్వీర్ పాల్గొన్నారు.